# సాక్షి అనంతపురం

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025






**చీనీ టన్ను రూ.21,900**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,900 పలికాయి.



**టమాట కిలో రూ.13**

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.7°/13.3°

జిల్లా వ్యాప్తంగా శనివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

## న్యూస్‌రీల్

### హంద్రీ-నీవా ఎస్‌ఈగా రాజ స్వరూప్



అనంతపురం సెంట్రల్: హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు ఎస్‌ఈగా ఎ.రాజ స్వరూప్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఫేజ్-6 ఈఈగా పనిచేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకూ సీఈ నాగరాజ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా బాధ్యతలు నిర్వర్తించారు.

### భారీ చోరీ కేసులో పురోగతి

- పోలీసుల అదుపులో ముగ్గురు దొంగలు!

అనంతపురం: నగరంలో గత నెల 22న జరిగిన భారీ చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. గత నెలలో స్థానిక శ్రీనగర్‌కాలనీకి చెందిన కొండ్రెడ్డి వెంకట శివా రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో రూ.3.50 కోట్ల విలువైన బంగారు, డైమండ్, ఇతర విలువైన ఆభరణాలు, రూ.20 లక్షల సొమ్ము చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వెంకటశివా రెడ్డి ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో దొంగల ముఠాలోని ఐదుగురు రికార్డయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు... చోరీకి పాల్పడింది మధ్య ప్రదేశ్‌కు చెందిన వారని ప్రాథమికంగా నిర్ధారించారు. దుండగుల కోసం జల్లెడ పట్టిన ప్రత్యేక బృందాలు తాజాగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీంతో పాటు మొత్తం సొమ్ములో 60 శాతం రికవరీ చేసినట్లు సమాచారం. తక్కిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కాగా, పోలీసులు ఓ దొంగ కుమారుడిని అదుపులోకి తీసుకున్నా దొంగ మాత్రం దారికి రావడం లేదని తెలిసింది. బెయిల్ తెచ్చుకుంటాను కానీ.. లొంగిపోయే ప్రసక్తే లేదంటూ తప్పించుకు తిరుగుతున్నట్లు సమాచారం.

### గుత్తిలో డీఆర్ఎం సుడిగాలి పర్యటన



రైల్వే కార్మికులతో మాట్లాడుతున్న డీఆర్ఎం

గుత్తి: గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) చంద్రశేఖర్ గుప్తా శనివారం గుత్తిలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన డీజిల్‌షెడ్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం డీజిల్‌షెడ్‌తో పాటు ఇతర విభాగాల అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు పరిశీలించారు. వాబ్ టెక్ ఇంజిన్‌కు సంబంధించిన లోడ్ బాక్స్ ప్రారంభించారు. తదనంతరం అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. రైల్వే ఆస్పత్రి (రైల్వే కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, ఏడీఎంఈ సుంకన్న, ఎస్ఎంఎం శ్రవణ్ కుమార్, ఎస్ఎస్ఈ ప్రభుదాస్, డాక్టర్లు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వ పుణ్యమా అని అనంతపురం నగరపాలక సంస్థలో పాలన భ్రష్టు పట్టింది. నిరంతరం కబ్జాలు, ఆక్రమణలు, వసూళ్లు నేతలకు ఆదాయ వనరులుగా మారాయి. టీడీపీ ప్రజాప్రతినిధులు అధికారుల చేతులు కట్టేసినంత పని చేశారు. తాము చెప్పిన ఫైళ్లపై సంతకాలు పెట్టకపోతే రెండు వారాలకు మించి కమిషనర్‌లు పనిచేయని దుస్థితి నెలకొంది.

## పాలనకు పచ్చ నిర్వచనం

# అరాచకాలే సమస్తం

- అనంతపురం కార్పొరేషన్‌కు చెదలు
- ఆరు మాసాల్లో ఐదుగురు కమిషనర్ల బదిలీ
- కీలక నేతల గుప్పిట్లో మున్సిపల్ అధికారులు
- వసూళ్ల మీడియేటర్లుగా వ్యవహరిస్తున్న వైనం
- పట్టపగలే కబ్జాలు చేస్తున్నా చర్యలు శూన్యం



అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గడిచిన ఆరు మాసాల్లో ఐదుగురు మున్సిపల్ కమిషనర్‌లు మారారంటే అనంతపురం కార్పొరేషన్ పరిధిలో పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయొచ్చు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా అధికారులు పనిచేయగలిగారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే ఐదుగురు కమిషనర్లు మారారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన నెలరోజులకే ఐఏఎస్ అధికారి మేఘ స్వరూప్ 2024 జులై 22న బదిలీ అయ్యారు. ఆయన తర్వాత ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పీవీవీఎస్ మూర్తి రాగా, రెండు మాసాల అనంతరం ఆయన కూడా బదిలీ అయ్యారు. ఇక.. ఆ తర్వాత వచ్చిన నాగరాజు మూడు మాసాలే పనిచేశారు. 2024 డిసెంబర్‌లో బదిలీ అయ్యారు. నాగరాజు స్థానంలో పీవీ రామలింగేశ్వర్ రాగా, ఈయన కూడా రెండు నెలలు కూడా గడవక ముందే బదిలీ కావడంతో తాజాగా బాలస్వామి వచ్చారు. కూటమి నేతల ఒత్తిళ్లతో తరచూ కమిషనర్లు మారడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది.

**అధికారులే మీడియేటర్లుగా..**

మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారు నగరంలో వందల్లో ఉన్నారు. వారినుంచి పెనాల్టీలు కార్పొరేషన్‌కు రావాలి. కానీ అధికార పార్టీ ప్రజాప్రతినిధి జేబులోకి మామూళ్ల రూపంలో వెళుతున్నట్టు విమర్శలున్నాయి. ఇందు కోసం ఒక మహిళా అధికారే అక్రమ నిర్మాణదారుల ఇళ్లకు వెళ్లి వసూళ్లు చేసి మీడియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. బదిలీపై వెళ్లిన ఈమె రెండు మాసాల్లో తిరిగి కార్పొరేషన్‌కు రాగలిగారు. ఇప్పటికీ అక్రమ నిర్మాణదారుల ఇళ్లకు ఈ అధికారి తరచూ వెళుతూ వసూళ్ల పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈమె దెబ్బకు మున్సిపల్ పరిధిలో నిర్మాణదారులు బెంబేలెత్తుతున్నారు. దీనికి తోడు కార్పొరేషన్‌లో ఆదాయమున్న పోస్టులకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వసూళ్లు చేసి నియామకాలు చేస్తున్నారు.

**అరాచక పర్వంలో మచ్చుకు కొన్ని సంఘటనలు..**

- మార్కెట్ ద్వారా కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి గండికొట్టేందుకు తాజాగా టెండరు వాయిదా వేశారు. తక్కువ ధరకు తీసుకోవాలన్నది దీని వెనుక ఉద్దేశం.
- అరవిందనగర్‌లో ఓ వైద్యుడు ఇల్లు కట్టుకుంటుంటే నేరుగా మహిళా అధికారే వెళ్లి వసూళ్లు చేసి లీడర్లకు, బిల్డర్‌కు మీడియేటర్‌గా వ్యవహరించారు.
- ఆర్టీఏ ఆఫీసు వెనకాల ఓ ఖాళీ స్థలాన్ని ఆక్రమించేందుకు స్థానిక నేతతో కలిసి ఓ ప్రజాప్రతినిధి యత్నించి విఫలమయ్యారు.
- గత ప్రభుత్వ హయాంలో భూమి పూజ చేసిన ఓ బ్రిడ్జికి సంబంధించి కాంట్రాక్టర్ వద్ద మళ్లీ డబ్బు తీసుకుని తిరిగి ప్రారంభించినట్టు తెలిసింది.
- తాజాగా ఖరీదైన స్థలాన్ని ఆక్రమించేందుకు వెళ్లడంతో పెద్ద రాద్ధాంతం అయింది.

| | |
|---|---|
| అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డులు | 50 |
| జనాభా | 4,50,000 వరకు |
| అర్బన్ నియోజకవర్గం మొత్తం ఓటర్లు | 2,81,593 |
| నగర పరిధిలో ఓటర్లు | 1,95,000 పైగా |

### మార్కుల నమోదు కేంద్రంలోకి ఎగ్జామినర్లకే అనుమతి

- ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణనాయక్



మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల ఆన్‌లైన్ మార్కుల నమోదు సమయంలో కేంద్రంలో ఎగ్జామినర్లకే అనుమతి ఉంటుందని, ఇతరులెవరూ ఉండకూడదని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణనాయక్ సూచించారు. ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు రెండో విడత, జనరల్ విద్యార్థులకు తొలివిడత ప్రాక్టికల్స్ ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో శనివారం స్థానిక కొత్తూరు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లకు ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణనాయక్ మాట్లాడుతూ రోజూ రెండు పూటలా ప్రాక్టికల్స్ జరగనున్నాయన్నారు. ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటలలోపు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంటలోపు ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లకు వచ్చే ఓటీపీ సాయంతో పాస్‌వర్డ్ నమోదు చేసి ప్రశ్నపత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సంతకాలు తీసుకుని వాటిని ఎగ్జామినర్లకు అందజేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీఎస్‌లు, ఎగ్జామినర్లు, నాన్‌టీచింగ్ ఉద్యోగులు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రాక్టికల్స్ నిర్వహించాలన్నారు. గాలి, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. ప్రతి సెంటర్‌లోనూ ఎగ్జామినర్లు మూడురోజులు, చీఫ్ సూపరింటెండెంట్లు ఐదు రోజులు ఉంటారన్నారు. తర్వాత మరో కేంద్రానికి నియమిస్తారన్నారు. కేంద్రాల్లో ఏ చిన్నపొరబాటు జరిగినా సంబంధిత సీఎస్‌లు, ఎగ్జామినర్లదే బాధ్యత అని హెచ్చరించారు. సమావేశంలో డీఈసీ సభ్యులు పాల్గొన్నారు.

## కలసి ఓడినా కలహం.. బలిగొంది ప్రాణం

- బెట్టింగ్ యాప్‌లో రూ.9 లక్షలు నష్టపోయిన నలుగురు స్నేహితులు
- నీ వల్లే ఓడామంటూ ముగ్గురు కలిసి ఒకరిపై తీవ్ర ఒత్తిడి
- అవమాన భారంతో స్నేహితుడి ఆత్మహత్య



కిషోర్‌కుమార్ (ఫైల్)





చావుకు స్నేహితులే కారణమంటూ రాసిన దృశ్యం

ఉరవకొండ: నలుగురు స్నేహితులు. సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఎంతో ఆశతో బెట్టింగ్ యాప్‌లో రూ.లక్షలు పోశారు. లాభం కాదు కదా చిల్లిగవ్వ లేకుండా డబ్బంతా పోయింది. అయితే, కలిసికట్టుగా ఆడిన వారు.. నష్టం వస్తే మాత్రం తట్టుకోలేకపోయారు. ముగ్గురు కలసి తమ స్నేహితుడిపైనే తిరగబడ్డారు. నీ వల్లే జరిగిందని, తమ డబ్బు ఇవ్వాలని ఒత్తిళ్లు చేయడం ప్రారంభించారు. దీంతో మనస్తాపం చెందిన ఆ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణం పొందాడు. ఉరవకొండలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుని బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఉరవకొండ పంచాయతీ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న కిషోర్‌కుమార్ (41) స్థానిక ముద్దలాపురం వద్ద ఉన్న సుజలాన్ విండ్ పవర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతని భార్య సునీత వైఎస్సార్ జిల్లా చెన్నూరు సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. తన స్నేహితులైన హరి, కేదార్, సంజయ్‌తో కలిసి కిషోర్‌కుమార్ మూడేళ్ల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడేవాడు. ఇటీవల నలుగురూ దాదాపు రూ.9 లక్షల వరకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్నారు. ఇందుకు కారణం నువ్వేనంటూ కిషోర్ కుమార్‌ను హరి, కేదార్, సంజయ్‌లు నిందించడం ప్రారంభించారు. డబ్బు తమకు తిరిగి ఇవ్వాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారు. శనివారం ఇంటి వద్ద గొడవకు దిగారు. దీంతో మనస్తాపానికి గురైన కిషోర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ జనార్దన్‌నాయుడు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

**'నా చావుకు స్నేహితులే కారణం'**

ఆత్మహత్య చేసుకొనే ముందు కిషోర్ తన చావుకు ముగ్గురు స్నేహితులే కారణమని, వారి పేర్లు హరి, కేదార్, సంజయ్ అని ఒక పేపర్‌తో పాటు షర్టుపై పెద్ద అక్షరాలతో రాశాడు. డేటా బెట్టింగ్ యాప్‌లో పెట్టిన డబ్బు మొత్తం తననే కట్టమని తీవ్ర ఒత్తిడి చేశారంటూ అందులో పేర్కొన్నాడు.

## శేష వాహనంపై శ్రీవారు

బుక్కరాయసముద్రంలో కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీవారు శేష వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఊరేగింపు చేపట్టారు. మహిళలు శ్రీవారికి మంగళ హారతులు పట్టారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీవారిని ఆదివారం రాత్రి హనుమద్వాహనంపై ఊరేగించనున్నట్లు అర్చకులు శ్రీనాథ్ స్వామి పేర్కొన్నారు. – బుక్కరాయసముద్రం



శేష వాహనంలో కొండమీదరాయుడు

## వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు

- దౌర్జన్యంగా రస్తా ఏర్పాటు



కోర్టు ఉత్తర్వులు, భూమి పత్రాలు చూపుతున్న బాధితులు

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అధికార టీడీపీ నేతలు కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. కొర్రపాడులో తలారి వెంకటలక్ష్మి, ఆమె కుమారులు పరమేష్, ఆనంద్ వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నారు. ఎన్నికల సమయంలో తమ మాట విన లేదని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కక్ష పెంచుకున్నారు. వెంకటలక్ష్మి సర్వే నంబర్-65లో 1.50 ఎకరాల భూమిని 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. అదే గ్రామానికి చెందిన బొగ్గు నాగభూషణ, నాగేంద్ర హరి, ఎర్రినాగప్పలు వారి పొలానికి ప్లాన్‌లో లేకపోయినా దౌర్జన్యంగా రస్తా కావాలంటూ వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవారు. గ్రామంలో టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ ఆదెప్ప అండ చూసుకుని స్పెషల్ పార్టీ పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో వెంకటలక్ష్మి పొలంలో రస్తా తీయించారు. ఈ సమస్య కోర్టు పరిధిలో ఉన్నా ఏమాత్రం లెక్క చేయలేదు. కోర్టు ఉత్తర్వులను లెక్క చేయకుండా రాత్రి సమయంలో దౌర్జన్యంగా తమ పొలం నుంచి రస్తా ఏర్పాటు చేయడం అన్యాయమని వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు వాపోయారు. తమపై రెండు సార్లు కత్తులతో దాడి చేశారని ఆరోపించారు. టీడీపీ నాయకుడు ఆదెప్ప నుంచి తమ కుటుంబానికి ప్రాణ హాని ఉందని తెలిపారు. గ్రామంలో గొడవలకు కారణమవుతున్న ఆదెప్పపై ఇటీవల పోలీసులు రౌడీ షీట్ ఓపెన్ చేసినా దౌర్జన్యాలకు పాల్పడుతూనే ఉన్నాడన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## ప్రశాంతంగా నవోదయ పరీక్ష

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 9వ తరగతిలో ప్రవేశం కోసం 1,084 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 849 మంది పరీక్షకు హాజరయ్యారు. 135 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా హిందూపురంలోని నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 1,228 మందికిగాను 919 మంది విద్యార్థులు హాజరయ్యారు. మరో 309 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష నిర్వహించడంలో సహకరించిన జిల్లా విద్యాశాఖ అధికారులకు, పోలీసు సిబ్బందికి జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# నత్తతోనే పోటీ

- రెవెన్యూ సదస్సులు ముగిసి నేటితో నెల పూర్తి
- సా....గుతున్న అర్జీల పరిష్కారం
- ప్రధాన సమస్యలకూ కానరాని మోక్షం

| రెవెన్యూ డివిజన్ | అందిన అర్జీలు | పరిష్కారం | పెండింగ్ |
|---|---|---|---|
| అనంతపురం | 2,579 | 1,566 | 1,013 |
| గుంతకల్లు | 2,832 | 1,867 | 965 |
| కళ్యాణదుర్గం | 1,449 | 944 | 505 |
| మొత్తం | 6,860 | 4,377 | 2,383 |



రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు (ఫైల్)

అనంతపురం అర్బన్: రెవెన్యూ సదస్సులను నిర్వహించడంలో చూపిన ఆర్భాటాన్ని... అర్జీల పరిష్కారంలో మాత్రం జిల్లా రెవెన్యూ యంత్రాంగం చూపడం లేదు. జిల్లాలో రెవెన్యూ సదస్సులను గత ఏడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 8వరకూ నిర్వహించారు. 503 రెవెన్యూ గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో భూ సమస్యలపై 6,860 అర్జీలు అందాయి. సదస్సులు ముగిసి శనివారం (ఈనెల 8వ తేదీ) నాటికి 31 రోజులైనా అర్జీలు పూర్తిస్థాయిలో పరిష్కరించలేదు. ఇప్పటి వరకు 4,377 అర్జీలు పరిష్కరించగా 2,483 పెండింగ్‌లో ఉన్నాయి.

**వెనుకబడ్డ 10 మండలాలు..**

అర్జీలను పరిష్కరించడంలో కొన్ని మండలాలు చాలా వెనుకబడ్డాయి. ప్రధానంగా 10 మండలాల్లో ఇప్పటికీ 50 శాతం అర్జీలను కూడా పరిష్కరించలేదు. ఈ విషయంలో కంబదూరు మండలం 60.92 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. అటు తరువాత 58.16 శాతంతో తాడిపత్రి, 55.59-బ్రహ్మసముద్రం, 54.47-శింగనమల, 52.38- బుక్కరాయసముద్రం, 45.36-పామిడి, 42.80-కూడేరు, 42.05-రాప్తాడు, 39.93-కళ్యాణదుర్గం, 38.79 శాతంతో పెద్దవడుగూరు మండలాలు ఉన్నాయి.

**50 శాతం పెండింగ్..**

అర్జీల్లో అత్యధికంగా ఆర్ఓఆర్, భూమి ఆక్రమణ, ఎఫ్‌లైన్, సర్వే, పట్టా సబ్‌డివిజన్, పొలాలకు రస్తా, నిషేధిత భూములకు సంబంధించి ఉన్నాయి. వాటిల్లో ఇప్పటికీ 50 శాతం దాకా పెండింగ్ ఉన్నాయి. భూమి ఆక్రమణలకు సంబంధించిన అర్జీలు 70.37 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఆర్ఓఆర్‌కు సంబంధించిన అర్జీలు 30.49 శాతం, ఎఫ్‌లైన్ (హద్దులు నిర్ధారణ) అర్జీలు 43.40, రీ-సర్వే అర్జీలు 44.97 శాతం, పట్టా సబ్ డివిజన్ అర్జీలు 44.97 శాతం, రస్తా వివాదాల అర్జీలు 44.11 శాతం, నిషేధిత భూములు (22ఏ)కు సంబంధించిన అర్జీలు 30.25 శాతం పెండింగ్‌లో ఉన్నాయి.

**ఇప్పటికీ సర్వే చేయలేదు**



మా తాత కొండప్ప పేరుపై గంగలకుంట పొలం సర్వే నంబరు 80-1,80-2లో 9.45 ఎకరాల భూమి ఉంది. రీసర్వేలో 74 సెంట్లు తక్కువగా చూపారు. మా భూమి పక్కనే 6 ఎకరాలను ఇద్దరు వ్యక్తులు కొనుగోలు చేశారు. అయితే ఏడెకరాల సాగులో ఉన్నారు. సర్వే చేసి మా భూమి మాకు చూపించాలని జనవరి 7వ తేదీన గంగలకుంటలో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చా. నెల దాటినా సమస్య పరిష్కారం కాలేదు. అధికారులను అడిగితే 'చేస్తాం చేస్తాం' అంటూ కాలయాపన చేస్తున్నారు.

– పాముళ్ల కొండప్ప, రాప్తాడు

**పరిష్కారానికి చర్యలు**



రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలను ఇప్పటికే చాలా వరకు పరిష్కరించారు. కొన్ని అర్జీల పరిష్కారంలో చట్టాలను అనుసరించి నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి అర్జీల పరిష్కారం కొంత ఆలస్యం అవుతుంది. అర్జీలను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎ.మలోల, జిల్లా రెవెన్యూ అధికారి

## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ ప్రారంభం



చెస్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట శ్రీ ఉషోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏడవ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. యువర్స్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 270 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వై.సుమన్, ఉషోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, హైబ్రో చెస్ అకాడమీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుసేన్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేధా శక్తికి మెరుగులు దిద్దేది ఒక్క చదరంగం క్రీడేనన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో రాణించాలని సూచించారు.

### 10న మద్యం షాపుల కేటాయింపు

అనంతపురం: కల్లు గీత కులాల కోటాలో మద్యం షాపులకు మొత్తం 63 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అనంతపురంలో గౌడ్ 11, గుంతకల్లులో ఈడిగ 18, తాడిపత్రిలో 1, రాయదుర్గం, కంబదూరు, రాయదుర్గం పరిధిలో ఈడిగ కులస్తులకు ఒక్కొక్కటి చొప్పున, గుత్తిలో ఈడిగ 11, గుంతకల్లులో ఈడిగ 4, కళ్యాణదుర్గంలో ఈడిగ 10, అనంతపురంలో ఈడిగ 2, కళ్యాణదుర్గంలో ఈడిగ 3 చొప్పున దరఖాస్తులు అందాయి. ఈ నెల 10న అనంతపురం జిల్లా పరిషత్‌లో ఉదయం 9 గంటలకు లాటరీ ప్రక్రియను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

### ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పాస్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఫెయిల్ లేదా పాస్ అయ్యి 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు కలిగిన యువతీ యువకులు 35 రోజుల పాటు బెంగళూరులో ట్యాలీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ తదితర అంశాలపై అన్ని వసతులతో ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలని సూచించారు.

# కృత్రిమ గర్భధారణలో కష్టాలు

- పాత కంటైనర్లలో ద్రవ వీర్యం ఆవిరి..
- సెమెన్ ఇంజెక్షన్ల సరఫరాలో అక్రమాలు
- రూ.40 డోసుకు రూ.180 దాకా వసూలు
- పాడి రైతులను దోచేస్తున్న అక్రమార్కులు



ఆస్పత్రుల్లో నిల్వచేసే 35 లీటర్ల కంటైనర్





గోపాలమిత్రలకు ఇచ్చే 3 లీటర్ల కంటైనర్



కృత్రిమ గర్భధారణ చేస్తున్న పశు వైద్యాధికారి

రాయదుర్గం: పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ కష్టాలు వెంటాడుతున్నాయి. ఉత్తమ జన్యు లక్షణాలను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తిని పెంచడంతోపాటు మేలు రకం పశు సంపద పెంపకానికి చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఆ దిశగా పాటుపడాల్సిన కూటమి సర్కార్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా పాలిచ్చే పశువుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. నాణ్యమైన వీర్యాన్ని (లిక్విడ్ నైట్రోజన్-ఎల్ఎన్-2) సేకరించి డిమాండ్ ఆధారంగా సరఫరా చేయాల్సి ఉన్నా అనేక కారణలతో లక్ష్యం నీరుగారుతోంది. పశు వైద్యశాలల్లో 35 కిలోల కంటైనర్లు, గోపాలమిత్రల వద్ద 3 కిలోల నిల్వ సామర్థ్యం కలిగిన కంటైనర్లు పాతవి ఉండడంతో ఒకసారి మూత తీసి పెడితే ద్రవ రూప వీర్యం నాణ్యత ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. కొత్త కంటైనర్లు సరఫరా చేస్తేనే కృత్రిమ గర్భధారణ విషయంలో పాడి రైతులకు న్యాయం జరుగుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆవులు, గేదెలు దాదాపు 6.50 లక్షలు ఉన్నాయి. వీటిలో ఎదకు వచ్చే పశువులకు కృత్రిమ గర్భధారణ చేపట్టాలి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు తిరుపతి నుంచి 45 నుంచి 50 రోజులకు ఒకసారి లిక్విడ్ నైట్రోజన్-2 (ద్రవ రూప వీర్యం) 14 వేల కిలోలు, అలాగే బనవాసి, నంద్యాల నుంచి సెమెన్ ఇంజెక్షన్ డోసులు 22 నుంచి 25 వేల దాకా సరఫరా అవుతున్నాయి. ఇంజెక్షన్ డోసులు కొన్ని చోట్ల ఉపయోగపడగా, మరిన్ని చోట్ల పక్కదారి పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సెమెన్ ఇంజెక్షన్ పేరిట దోపిడీ**

సెమెన్ ఇంజెక్షన్ బయట మార్కెట్లో రూ.200కు దొరుకుతుంది. ప్రభుత్వ వైద్యశాలల్లో రాయితీ కింద రూ.40కే ఇవ్వాలి. కానీ రెండు జిల్లాల్లోనూ చాలా ఆస్పత్రుల్లో ఇంజెక్షన్‌లు లేవని చెబుతున్నారు. గోపాలమిత్రులు, ఇతర పశు మెడికల్ క్లినిక్‌లకు వాటిని చేర్చి పర్సంటేజీలతో కొందరు వ్యాపారం చేస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో కొందరు గోపాల మిత్రులు రూ.150 నుంచి రూ.180 వరకు రైతుల నుంచి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాడి రైతుకు అదనపు భారం మోపుతున్నారు.

| ఉమ్మడి జిల్లాలో పశువైద్యశాలల వివరాలు | |
|---|---|
| ఏరియా పశువైద్యశాలలు | 30 |
| పశువైద్య కేంద్రాలు | 116 |
| గ్రామీణ పశువైద్యశాలలు | 36 |
| ఆవులు, గేదెల సంఖ్య | 6.50 లక్షలు |
| లిక్విడ్ నైట్రోజన్ (ద్రవ వీర్యం) సరఫరా | 14వేల కిలోలు |
| సెమెన్ డోసులు | 22 నుంచి 25 వేలు |

**కొత్త కంటైనర్లకు ప్రతిపాదనలు**

లిక్విడ్ నైట్రోజన్-2 (ద్రవ వీర్యం) ఆవిరి నిల్వ శాతం తగ్గించేలా కృషి చేస్తాం. అవసరమైన చోట్ల కొత్త కంటైనర్లకు ప్రతిపాదనలు పంపాం. పశు వైద్యశాలల్లో నిల్వ ఉంచే 35 లీటర్ల కంటైనర్లతో ఇబ్బంది లేదు. వాటికి అవసరయ్యే మరమ్మతులు వెంటనే చేపట్టేలా చూస్తున్నాం. గోపాలమిత్రలతో ఉండే చిన్న కంటైనర్లలో కొన్నిచోట్ల ఆవిరైపోవడం కనిపించాయి. అలాంటి చోటకూడా సాధ్యమైనంత వరకు మార్పించాం. లిక్విడ్ నైట్రోజ్-2 (ద్రవ వీర్యం) పూర్తిగా ఉచితంగా అందిస్తున్నాం. ఇంజెక్షన్‌కు రూ.40 మాత్రమే చెల్లించాలి. అదికూడా భారత పశుగణన యాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు ఉచితంగా ఇచ్చేలా కృషి చేస్తున్నాం. అక్రమాలు చోటు చేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్, వెటర్నరీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అనంతపురం

## చీనీలో ఎగిరేపేను, బంకతెగులు

అనంతపురం అగ్రికల్చర్: కీలకదశలో ఉన్న చీనీ తోటలకు ప్రస్తుతం ఎగిరేపేను (పొలుసు పురుగు), బంక తెగులు ఆశించి దిగుబడులపై ప్రభావం చూపిస్తున్నాయని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ త్రికలా మాధవి తెలిపారు. నివారణలో ఏ మాత్రం ఆలస్యం చేసినా నష్టం జరిగే అవకాశం ఉన్నందున.. లక్షణాలు, పురుగులు కనిపించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఇటీవల తాడిపత్రి, గార్లదిన్నె ప్రాంతాల్లో చీనీ తోటలను సందర్శించిన సమయంలో వీటి ఉనికి ఉధృతి గుర్తించామన్నారు. ఎగిరేపేను లేదా పొలుసు పురుగు నివారణకు 1 మి.లీ అబామెక్టిన్ లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా పూత లేదా కొత్త ఇగురు వచ్చిన తోటల్లో తప్పకుండా సస్యరక్షణ చేపట్టాలన్నారు. ఇక బంకతెగులు నివారణకు కాండం 45 సెంటీమీటర్ల వరకు బోర్డో మిశ్రమాన్ని పూయాలన్నారు. అలాగే ట్రైకోడెర్మా హర్జియానం + ట్రైకోడెర్మావిరిడీ + సూడోమోనాస్‌ఫ్లోరోసెన్స్ 100 గ్రాములు చొప్పున ఒక్కో మొక్క పాదుల్లో వేయాలన్నారు. ఆ తర్వాత 0.2 శాతం ఫాసిటైల్ ద్రావణాన్ని కాండం, మొక్క బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం



మృతి చెందిన షేక్ ఇబ్రహీం

రాయదుర్గంటౌన్: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రాయదుర్గంలోని గొగ్గిరొట్టి ఏరియాకు చెందిన షేక్ ఇబ్రహీం (42) ఆటో డ్రైవర్. శనివారం అదే ఏరియాలోని బొరుగుల విక్రేతలైన రెహమాన్, ఇబ్రు సాబ్‌లు బొరుగులు తీసుకొచ్చేందుకని ఇబ్రహీం ఆటోను బాడుగకు మాట్లాడుకున్నారు. సాయంత్రం బొరుగులు తీసుకుని రాయదుర్గానికి వస్తుండగా పై తోట సమీపంలో మారెమ్మగుడి దాటిన తరువాత అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షేక్ ఇబ్రహీంను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయినా పరిస్థితి విషమించడంతో ఇబ్రహీం మృతి చెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇక బొరుగుల విక్రేతలు ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అర్బన్ సీఐ జయానాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

## కులగణన చేపట్టాలి

గుంతకల్లు: రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే వెంటనే చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం గుంతకల్లులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కులగణన పూర్తి చేసి నివేదికను సైతం ప్రభుత్వానికి సమర్పించిన విషయాన్ని గుర్తి చేశారు. మన రాష్ట్రంలో కూడా జన గణన కాకుండా కులగణన చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తెలంగాణ తరహాలోనే ఇక్కడా 42 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. ఈ విషయాలపై అందరిలో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నెల 12న గుంతకల్లులో అన్ని బీసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బీ.మహేష్, పట్టణ, రూరల్ అధ్యక్షులు గోపీనాథ్, రాము రాయల్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు వెండి దొంగల అరెస్ట్

- ఆరు దేవాలయాల్లో చోరీ చేసిన వస్తువుల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

రాప్తాడు: దేవాలయాల్లో వెండి వస్తువులు చోరీ చేసే నలుగురు దొంగలను గార్లదిన్నె మండలం లోలూరు క్రాస్ వద్ద శనివారం అరెస్ట్ చేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. వీరి నుంచి రూ.2.70 లక్షలు విలువ చేసే 3 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాప్తాడులోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం మీడియాకు వెల్లడించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా గార్లదిన్నె మండలం లోలూరు క్రాస్ వద్ద శ్రీరామ్ ఆటో ఫైనాన్స్ గోడౌన్ దగ్గర అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన కూరపాటి సాయికుమార్, అక్కమ్మపల్లికి చెందిన కునుముక్కల చాంద్‌బాషా, ఎ.నారాయణపురంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ సర్దార్ వలి, అనంతపురం టౌన్‌లోని బళ్లారి బైపాస్ సమీపంలోని ఎల్‌బీ నగర్‌కు చెందిన బగవన్ సాదిక్ బాషాలు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా సంచిలో వెండి కోర మీసాలు, వెండి కన్నులు, బంగారు గిన్నె బొట్టు, రెండు వెండి కిరీటం, నాలుగు గొడుగులు, వెండి చెవి, వెండి రాముడి పతకం, వెండి మొలతాడు, వెండి పాదుకలు, అమ్మవారికి సంబంధించిన వెండి ముఖం, వెండి కిరీటం, వెండి గొలుసు, 2 పెద్ద గొడుగులు, 10 చిన్న గొడుగులు, నాగాభరణం, చిన్న పడిగాలు, వెండి ముఖ కవచం దాదాపు మూడు కిలోల వెండి వస్తువులు లభించాయి. వీరు కొంత కాలంగా ఆలయాల్లో చోరీలకు పాల్పడుతుండేవారు. వీరి వద్ద లభించిన వస్తువులన్నీ శింగనమల చెరువు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి, దుర్గమ్మ గుడి, గురుగుంట్లలోని చౌడేశ్వరి దేవి ఆలయం, అనంతపురం రూరల్ పీఎస్ పరిధిలోని గొల్లపల్లి గంగమ్మ గుడి, ఆత్మకూరు పీఎస్ పరిధిలో యాలేరులోని అక్కమ్మ ఆలయం, నార్పల పీఎస్ పరిధిలో నడిమిదొడ్డిలో కుంటాలమ్మ దేవాలయంలో చోరీ అయినవిగా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్స్ ఫరూక్, నాగేష్, రాజేష్, ధను, యూనస్, షెక్షాను ఎస్పీ జగదీష్, డీఎస్పీ వెంకటేశులు అభినందించారు. శింగనమల సీఐ కౌలుంట్లయ్య, ఎస్ఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# కురుగుంటలో మహిళా రైతుపై దాడి

- అధికార పార్టీ అండతో రెచ్చిపోయిన వైనం



చికిత్స పొందుతున్న బాధితురాలు లక్ష్మీదేవి

రాప్తాడురూరల్: అధికార టీడీపీ అండతో కొందరు రెచ్చిపోయి మహిళా రైతుపై దాడిచేసి చేయి విరగ్గొట్టారు. శనివారం అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు....కురుగుంటకు చెందిన అవిలిగొండ సిద్దన్న 1977లో కురుగుంట పొలం సర్వే నంబరు 48/2లో 13.13 ఎకరాలు కొనుగోలు చేశాడు. పక్కనే 48/1 సర్వే నంబరులో సజ్జలకాలువకు చెందిన మాలపాటి వెంకటప్ప, మాలపాటి చంద్రమోహన్, మాలపాటి ఈశ్వరయ్య, మాలపాటి సుబ్బన్న కుటుంబాలకు 14.68 ఎకరాల భూమి ఉంది. సిద్దన్న కుటుంబానికి తూర్పు వైపు, మాలపాటి కుటుంబానికి పడమర వైపు భూములున్నాయి. ఇవన్నీ పూర్వ పట్టాలు కల్గినవే. అవగాహన లేక ఏళ్ల తరబడి మాలపాటి కుటుంబ సభ్యులు తూర్పు భాగంలోని కొంత భూమి (అవిలిగొండ కుటుంబానిది)లో సాగు చేసుకుంటున్నారు. అవిలిగొండ కుటుంబ సభ్యులు కూడా అంతే కొలత భూమి (మాలపాటి కుటుంబానిది)లో సాగు చేసుకుంటూ వస్తున్నారు. ఈ విషయం 2021లో సర్వే చేయించినపుడు బయటపడింది. అయితే.. అప్పటివరకు ఎలా సాగు చేసుకుంటున్నామో అదేవిధంగానే ఉండాలంటూ మాలపాటి కుటుంబ సభ్యులు గొడవ చేశారు. ఈ క్రమంలోనే సిద్దన్న కుమారుడు రాముడుపై దాడి చేశారు. ఈ కేసులో మాలపాటి కుటుంబ సభ్యులు ముగ్గురు రిమాండ్‌కు కూడా వెళ్లొచ్చారు.

**తాజాగా రాముడు భార్యపై దాడి..**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాలపాటి కుటుంబ సభ్యులు మరోమారు భూమిలోకి వెళ్లే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇటీవల జేసీబీతో చదును చేయించేందుకు వెళ్లగా.. అవిలిగొండ సిద్దన్న కుమారులు అడ్డుకుని వెనక్కు పంపారు. శనివారం ట్రాక్టర్లను పెట్టి సాగు చేయాలని చూడగా రాముడు భార్య లక్ష్మీదేవి అడ్డుకుంది. దీంతో ఆమెపై మాలపాటి కుటుంబ సభ్యులు దాడి చేయడంతో చేయి విరిగింది. బాధితురాలిని సర్వజనాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## చీనీ తోటకు నిప్పు

కూడేరు: మరుట్ల–2వ కాలనీ రైతు కొండప్పగారి శ్రీనివాసులుకు చెందిన చీనీ తోటకు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో 400 చీనీ చెట్లు, డ్రిప్ పరికరాలు కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



## జొన్న ఇగురు తిని 31 గొర్రెలు మృతి



తాడిపత్రి రూరల్: జొన్న ఇగురుతిని 31 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాధితులు తెలిపిన మేరకు... వెంకటాంపల్లికి చెందిన పలువురు కాపరులు శనివారం గొర్రెల మందను మేత కోసం సమీప పొలాల వైపు తీసుకెళ్లారు. అక్కడ కొన్ని గొర్రెలు లేత జొన్న మొక్కలను తినాయి. కొంతసేపటికే అస్వస్థతకు గురయ్యాయి. కంగారు పడ్డ కాపర్లు వెటర్నరీ డాక్టర్ సుబ్బారెడ్డికి ఫోన్ చేశారు. ఆయన వచ్చి వాటిని పరీక్షించగా.. అందులో 31 గొర్రెలు చనిపోయాయని ధ్రువీకరించారు. సంజీవయ్య, రామాంజినేయులు, గోపాల్‌కు చెందిన 15 గొర్రెలు, గంగాశేఖర్‌కు చెందిన 4 గొర్రెలు, ఓబులేసు, నరసింహయ్యలకు చెందిన 12 గొర్రెలు చనిపోయిన వాటిలో ఉన్నాయి. అనంతరం వాటికి అక్కడే పోస్టుమార్టం చేశారు.

## విషపుద్రావణం తాగి 29 మేకలు మృతి



బెళుగుప్ప: బ్రాహ్మణపల్లి తండాలో శనివారం మొక్కజొన్న పంటకు పిచికారీ చేసే రసాయన మందు ద్రావణాన్ని తాగి 29 మేకలు మృత్యువాత పడ్డాయి. బాధిత కాపర్లు నాగరాజు నాయక్, చంద్రానాయక్‌లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని అనిల్‌నాయక్‌కు చెందిన మొక్కజొన్న తోట వద్ద పైరుకు పిచికారీ చేసే రసాయన మందు ద్రావణాన్ని మేతకోసం వెళ్లిన మేకలు తాగాయి. తాగిన కొద్దిసేపటికే నాగరాజు నాయక్‌కు చెందిన 19 మేకలు, చంద్రానాయక్‌కు చెందిన 10 మేకలు మృత్యువాత పడ్డాయి. హుటాహుటిన పశు వైద్యాధికారి రమేష్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది గ్రామానికి చేరుకుని నీరస పడిన మరో 20 మేకలకు చికిత్స చేశారు. మేకల మృతితో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

## పాఠశాలల రద్దు నిర్ణయంపై పోరుబాట

అనంతపురం ఎడ్యుకేషన్: ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలలను రద్దు చేయాలనే నిర్ణయంపై పోరుబాట చేపడతామని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు హెచ్చరించారు. శనివారం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జిల్లాశాఖ సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల విధానం పేరుతో రాష్ట్రంలో వేలాది ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను రద్దు చేయడానికి ప్రభుత్వం పూనుకుందన్నారు. ప్రస్తుత విధానాలకంటే మెరుగైన విధానాలను అందిస్తామని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం పాఠశాలల మూసివేత దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఫలితంగా బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యాహక్కు చట్టం మేరకు పొందాల్సిన విద్యను పొందలేక డ్రాపౌట్స్‌గా మారే ప్రమాదముందన్నారు. జీవనోపాధికోసం ఇతర జిల్లాలకు వెళ్లిన విద్యార్థుల పేర్లను స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంఈఓలు, హెచ్ఎంలపై ఒత్తిళ్లు చేసి తొలిగిస్తున్నారని వాపోయారు. ఎస్ఎంసీ సమావేశాలు ఏర్పాటు చేయించి బలవంతంగా అంగీకరించేలా చేయడం అమానుషం అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆదర్శ పాఠశాలల స్థానంలో 117 జీఓ కంటే ముందు ఉన్న విద్యావిధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్, నాయకులు వెంకటరమణ, వన్నప్ప, పుల్లయ్య, సీతారాం, హిమగిరి ప్రసాద్, హనుమంతు, రామాంజనేయులు పాల్గొన్నారు.

# కీర్తికి అండగా ఉంటాం

- ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ

సాక్షి ఎఫెక్ట్..



చిన్నారి యోగ క్షేమాలు తెలుసుకుంటున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వనజాఅక్కమ్మ

అనంతపురం సెంట్రల్: తల్లి దండ్రులకు దూరమై అష్టకష్టాలు పడుతున్న చిన్నారి కీర్తికి ప్రభుత్వం తరుపున అన్నిరకాలుగా అండగా ఉంటామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వనజాఅక్కమ్మ తెలిపారు. శనివారం సాక్షిలో 'కీర్తి కథ ..కన్నీటి వ్యథ' శీర్షికన వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. నగరంలో పాతూరు మున్నానగర్‌లో కీర్తి నివాసముంటున్న ఇంటికి ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ లలిత, ఐసీపీఎస్, శిశుగృహ, చైల్డ్‌లైన్ సిబ్బంది వెళ్లారు. పాప నాన్నమ్మ వెంకటలక్ష్మితో మాట్లాడారు. కుటుంబకలహాలతో ఎవరికి వారు దూరం కావడంతో చిన్నారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడినట్లు గుర్తించారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఎన్ఆర్‌సీలో పాపకు చికిత్సతో పాటు కొద్దిరోజులు పౌష్టికాహారం అందించాల్సి ఉందని తెలిపారు. భవిష్యత్‌లో చిన్నారికి ఆశ్రయం, విద్యను అందించేందుకు సహాయం చేస్తామని వెల్లడించారు. అయితే కొన్ని విషయాలకు తల్లిదండ్రులు సముఖత వ్యక్తం చేయకపోవడంతో సోమవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరిచి వారి ఆదేశాలతో చిన్నారి సంరక్షణకు చర్యలు తీసుకుంటామని పీడీ వనజాఅక్కమ్మ వివరించారు. చిన్నారి తల్లివద్ద పెరగకపోవడంతో పౌష్టికాహారం లోపంతో ఇబ్బందులు పడే అవకాశముందని వెల్లడించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు.

# అనంతలో 14 నుంచి బాలోత్సవం



బాలోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటి నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: చిన్నారుల్లో సహజంగా ఉండే సృజనను, ప్రతిభా పాటవాలను వెలికితీయడానికి ఈ నెల 14 నుంచి అనంతపురంలో బాలోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈసారి వేదికను ఆర్ట్స్ కళాశాల మైదానానికి బదులు లలిత కళా పరిషత్తుకు మార్పు చేశారు. పండుగ వాతావరణంలో నిర్వహించే బాలోత్సవానికి అధిక సంఖ్యలో తరలిరావాలని బాలోత్సవ కమిటీ చైర్ పర్సన్ షమీమ్ షఫీవుల్లా పిలుపునిచ్చారు. శనివారం రామనగర్‌లోని క్రీసెంట్ హాలులో బాలోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ నెల 14, 15, 16 తేదీల్లో లలితకళా పరిషత్తులో సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, దేశభక్తి ప్రబోధితమైన వేషధారణలతో చిన్నారుల సృజనకు అన్ని విధాలుగా దోహదపడే బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రచయితలు, కవులు ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఆహ్వాన కమిటీ ప్రతినిధులు డాక్టర్ ప్రసూన, ఐద్వా నాయకురాలు సావిత్రి తదితరులు మాట్లాడుతూ కల్చరల్, అకడమిక్ విభాగాల్లో పోటీలు ఉంటాయని, అన్ని పాఠశాలల వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలోత్సవ్ కమిటీ సభ్యులు ఏజీ రాజమోహన్, రామాంజనమ్మ, చంద్రకళ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డ్రగ్స్ రహిత సమాజంతోనే యువ ప్రగతి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం:** డ్రగ్స్ రహిత సమాజంతోనే యువ ప్రగతి సాధ్యమని అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుధాకర్ బాబు పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. 'ఆరోగ్య సంరక్షణకు నడక నాంది' అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీలో పలువురు అథ్లెట్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుధాకర్ బాబు హాజరయ్యారు.

### నేడు మహా గణపతి హోమం

**ఆత్మకూరు:** మాఘమాస ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహా గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు, కాలసర్పదోష నివారణ హోమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్నదానం కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు.

### తిరుమలకు పాదయాత్ర



పేరూరు నుంచి తిరుమలకు పాదయాత్రగా తరలివెళ్తున్న భజన బృందం సభ్యులు

**రామగిరి:** మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన భజన బృందం సభ్యులు శనివారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని కోరుతూ భజన బృందం సభ్యులు దాదాపు 20 ఏళ్లుగా తిరుమలకు పాదయాత్ర చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కూడా మోహన్‌దాస్ స్వామి ఆధ్వర్యంలో రామకృష్ణ, వెంకటరెడ్డి, రాజా, నాగరాజు, శ్రీనివాసులు, మాధవరాజు, సత్యప్ప తదితరులతో కూడిన 30 మంది సభ్యులు తిరుమలకు బయలుదేరారు. రాత్రికి వారు రాగిమేకలపల్లిలో బసచేశారు. ఆదివారం పాదయాత్ర ప్రారంభించి గోరంట్ల, వాయల్పాడు, పీలేరు, శ్రీనివాసమంగాపురం మీదుగా ఆరు రోజులు పాదయాత్ర చేసి తిరుమల చేరుకోనున్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడల్లో సత్తా చాటిన ఆత్మకూరు వాసులు

**ఆత్మకూరు:** అనంతపురంలోని పీటీసీలో శనివారం నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ స్టేట్ మీట్‌లో ఆత్మకూరు క్రీడాకారులు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆత్మకూరుకు చెందిన జగన్‌మోహన్ రెడ్డి ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రోలో ప్రథమ స్థానంలో నిలిచారు. లాంగ్‌జంప్‌లోనూ రెండో స్థానం దక్కించుకున్నారు. మరో క్రీడాకారుడు తైదుల శివారెడ్డి ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే బాలపోతన్న జావెలీన్ త్రో, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరంతా మార్చి 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

### క్రీడా సామగ్రి వితరణ



క్రీడాసామగ్రిని అందిస్తున్న నెహ్రూ యువకేంద్రం అధికారులు

**అనంతపురం కల్చరల్:** నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం పలు యువజన సంఘాల యువతకు క్రీడా సామగ్రిని అందించారు. ఎస్వైకే డీడీఓ శ్రీనివాసులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జయమారుతి, జీవన్ కుమార్, యాదవ ఫౌండేషన్ చైర్మన్ హరీష్ కుమార్‌యాదవ్ తదితరులు మాట్లాడారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ముఖ్యంగా నాయకత్వ లక్షణాలను కలిగి ఉంటేనే ఉన్నతి ఉంటుందన్నారు. చదువు మీదనే కాకుండా క్రీడలు, రాజకీయాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, సామాజిక సేవా కార్యక్రమాలలో తరచూ ఇతరులకు సాయంగా నిలవాలని సూచించారు. అనంతరం యువతీ యువకులకు మెడల్స్ అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సత్యసౌమ్య, లహరి, సామాజిక సేవా కార్యకర్తలు వెంకటేష్, అంబరీష్, ప్రవీణ్ తదితరులున్నారు.

# సీజన్ పండ్లు..ఆదాయం మెండు

- వేసవిలో కర్భూజ, కళింగర, బొప్పాయికి ఫుల్ డిమాండ్
- సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సాగు చేస్తున్న ఆత్మకూరు రైతులు
- రెండు నెలల్లో పంట చేతికి వచ్చే అవకాశం

**ఆత్మకూరు:** ఉద్యాన పంటలకు పేరుగాంచిన జిల్లాలో ఆత్మకూరు మండల రైతులు వినూత్నంగా ఆలోచించారు. స్వల్పకాలంలోనే చేతికందే ఉద్యాన పంటలు సాగుచేస్తున్నారు. వేసవిలో ఫుల్ డిమాండ్ ఉండే కర్భూజ, కళింగరను ఎక్కువగా సాగుచేస్తున్నారు. అలాగే బొప్పాయి, అరటి కూడా చెప్పుకోదగ్గ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

**సీజన్‌లో దృష్టిలో ఉంచుకుని పంటల సాగు**

వేసవి సమీపిస్తోంది. ఫిబ్రవరిలోనే భానుడు భగభగమంటున్నాడు. ఇక మార్చి నాటికి ఉగ్రరూపం చూపుతాడు. దీంతో వేసవి నుంచి ఉపశమనం కోసం ప్రజలు చల్లదనాన్ని ఎక్కువగా కోరుకుంటారు. అలాగే ఆరోగ్యానికి అంతే ప్రాధాన్యత ఇస్తారు. దీంతో వేసవిలో కళింగర (పుచ్చకాయ), దోసకాయ, కర్భూజ, చీనీ, అరటి పండ్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. దీన్ని గుర్తించిన ఆత్మకూరు మండల రైతులు ఎక్కువగా ఇవే పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఇప్పటికే సాగులో పంటలన్నీ రెండు నెలల్లో అంటే ఏప్రిల్ చివరి వారానికి చేతికందే అవకాశం ఉంది. సరిగ్గా ఎండలు ముదిరేనాటికి పంట చేతికందితే ఆశించిన ధర దక్కుతుంది. అలాగే మరో రెండు నెలల్లో రంజాన్ మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో ముస్లింలు ఉపవాసం వదిలే సమయంలో ఎక్కువగా కళింగర, ఖర్భూజ పండ్లను తీసుకుంటారు. అప్పటికి ధరలు బాగా పెరగవచ్చని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో కిలో అరటి రూ.20కిపైగా, బొప్పాయి రూ.20 వరకు పలుకుతున్నాయి. ఇక సమ్మర్ సీజన్ కూడా తోడైతే ధర పెరిగి లాభాలు వస్తాయని భావిస్తున్నారు.



వద్దుపల్లి వద్ద పండిన ఖర్భూజ కాయలను చూపుతున్న రైతు ఆనందరెడ్డి



పంపనూరు వద్ద సాగు చేసిన అరటి





సాగులో ఉన్న కళింగర



కర్భూజ

**ఖర్చుతో పాటు.. కష్టం కూడా ఎక్కువే**

బొప్పాయి పంట

బొప్పాయి, కళింగర, ఖర్భూజ, అరటి తదితర పంటలు సాగు చేయాలంటే ఖర్చుతో పాటు కష్టం కూడా ఎక్కువగానే ఉంటుందని రైతులు చెబుతున్నారు. బొప్పాయి, ఖర్భూజ, చీనీ తదితర పంటలకు ఒక ఎకరాకు రూ.50 వేలకుపైగా, అరటి, కళింగర పంటలకు ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని రైతులు తెలిపారు. ఇక కుటుంబం మొత్తం రోజూ తోటల్లో శ్రమించాల్సి ఉంటుందన్నారు. నీరు కట్టడం మొదలు, డ్రిప్పు ద్వారా మందులు వదలడం వరకూ చాలా కష్టం ఉంటుందంటున్నారు. అదృష్టం బాగుండి పంటలు పండితే లాభాలు వస్తాయని, ఉత్పత్తులకు ఆశించిన ధరలు రాకపోతే పెట్టుబడి కూడా చేతికి అందే పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు.

**రెండు నెలల్లో దిగుబడి వస్తుంది**



నేను మూడు ఎకరాల్లో కర్భూజ పంట సాగుచేశా. పంట కాలం 70 రోజులు. ఇప్పటికే 10 రోజులైంది. ఇంకో రెండు నెలలు అంటే ఏప్రిల్ చివరి నాటికి పంట చేతికి వస్తుంది. అప్పటికి ఎండలు బాగా ముదురుతాయి. దీంతో కర్భూజకు మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నా. ఇప్పటికే మా మండలంలోని రైతులంతా కళింగర, కర్భూజ పంటలు సాగుచేస్తున్నారు.

– జగదీశ్వరరెడ్డి, ఆత్మకూరు

### పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం

**అనంతపురం కల్చరల్:** జిల్లా కేంద్రంలో సాగే మహా కుంభాభిషేకం దిగ్విజయం కావాలని మేయర్ వసీం అన్నారు. ఈనెల 14 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న కుంభాభిషేక కార్యక్రమ బ్రోచర్లను, కరపత్రాలను శనివారం మేయర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కుంభాభిషేకం అందరిలో ఆధ్యాత్మిక భావన నింపాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ హంపీ పీఠాధిపతులు విద్యారణ్యస్వామి ఆలయానికి విచ్చేస్తున్నారని, ఆయన నేతృత్వంలోనే మహా కుంభాభిషేకం సాగుతుందన్నారు. అధిక సంఖ్యలో తరలి వచ్చే వేదపండితులు, దేశంలోని అన్ని పవిత్ర నదీజలాలతో 1,008 కుంభాలతో సాగే అభిషేకంలో భక్తులందరినీ భాగస్వాములు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు హరికిషోర్‌శర్మ, గుప్తా, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### శంకరమఠం వార్షికోత్సవం ప్రారంభం



పూజలందుకున్న శారదామాత

**అనంతపురం కల్చరల్:** నగరంలో ఆహ్లాదకర వాతావరణంలో ఆధ్యాత్మిక సేవలందిస్తున్న శృంగేరీ శారదా శంకర మఠం 30 వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పండుగ వాతావరణంలో ఉదయం మఠంలో కలశారాధన, గణపతి హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం చదువుతల్లి శారదామాత అలంకార సేవల్లో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా మేనేజర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం మూలమూర్తులకు అభిషేకం, చండీహోమం జరుగుతాయని భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

**కూడేరు:** మండలంలోని అరవకూరు వద్ద శనివారం అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమిదాలకు చెందిన ఎర్రిస్వామి తీవ్రంగా గాయపడగా, పద్మావతి, సరస్వతి, గోపాల్ స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. పద్మావతి అనే మహిళను ఆటోలో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. అవరకూరు వద్దకు రాగానే రోడ్డుపక్కన ఆటోను నిలిపారు.వెనుకవైపున కర్ణాటక ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొనింది. గాయపడిన వారిని 108 వాహనంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### తాడిపత్రి రహదారిపై లారీ బోల్తా

**బుక్కరాయసముద్రం:** మండలంలోని హెచ్ఎల్‌సీ కెనాల్ సమీపంలో అనంతపురం- తాడిపత్రి రహదారిపై శనివారం లారీ బోల్తాపడింది. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి వైపు నుంచి అనంతపురానికి వెళ్తున్న కట్టెల లోడుతో వెళ్తున్న లారీ కెనాల్ సమీపంలో రహదారిపై వేగంగా వస్తూ డివైడర్‌ను ఢీకొని, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

# భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



విష్ణుసహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు



రుక్మిణీవిఠల పాండురంగ ఆలయంలో నిజరూపదర్శనం

**అనంతపురం కల్చరల్:** విష్ణు సహస్రనామ పారాయణంతో ఆలయం మార్మోగింది. వేంకటేశ్వ స్వామికి ప్రీతికరమైన శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు రావడంతో పలు వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 18వ పర్యాయం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం సాగింది. మరో మూడు నెలల వరకు క్రమం తప్పకుండా ప్రతిరోజు సాయంత్రం ఆలయంలో పారాయణం ఉంటుందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు మేడా వేంకటేశ్వర్లు, రమేష్ తెలిపారు.

- రామనగర్‌లోని రుక్మిణీ విఠల పాండురంగ స్వామి ఆలయంలో స్వామివారి నిజరూపదర్శనం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతిరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. తపోవనంలోని శ్రీక్షేత్రంలో మాజీ ప్రభుత్వ ఎండోమెంటు సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ నేతృత్వంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణానికి జిల్లా శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు ఆచరించారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుడు, వరాహ నారసింహుడు, గోదారంగనాథుల దేవతామూర్తులకు విశేష పుష్పార్చన సేవలందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

# బడ్జెట్‌ను పకడ్బందీగా సిద్ధం చేయాలి

- కమిషనర్ బాలస్వామి



అధికారులతో సమావేశమైన కమిషనర్ బాలస్వామి

**అనంతపురం కార్పొరేషన్:** నగరపాలక సంస్థ బడ్జెట్‌ను పకడ్బందీగా సిద్ధం చేయాలని కమిషనర్ బాలస్వామి అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో వివిధ సెక్షన్ల హెడ్లతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ ఏడాది నగరపాలక సంస్థ బడ్జెట్‌లో ఎటువంటి తప్పులు లేకుండా ఒకటికి రెండు సార్లు చూసుకోవాలన్నారు. సెక్షన్ హెడ్స్ బాధ్యతగా పని చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయిలో పని పేరుతో పత్తా లేకుండా పోతే ఉపేక్షించేది లేదన్నారు. అంతకుముందు ఉదయం ఆయన నగరంలోని అన్నా క్యాంటీన్లను పరిశీలించారు. సుభాష్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ఓలు విజయ్‌కుమార్, లక్ష్మిదేవి, ఏసీపీ శిరీష, టీపీఎస్‌లు మంజుల, దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కులు కాలరాస్తే సహించం

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



తండా వాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

**చెన్నేకొత్తపల్లి:** రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులను కాలరాస్తే సహించబోమని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ హెచ్చరించారు. శనివారం ఆయన మండల పరిధిలోని గంగినేపల్లి పంచాయతీ పరిధిలోని మేకేనాయక్ తండా, ఎర్రోనిపల్లి తండాల్లో పర్యటించారు. మేకేనాయక్ తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా గిరిజన తండాల్లో భూ సమస్యలున్నాయని, అధికారులు వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొందరు గిరిజన భూములను ఆక్రమిస్తున్నారని, దాడులు చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని కమిషన్‌కు ఫిర్యాదు అందాయన్నారు. అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం గిరిజన హక్కులు గురించి వివరించారు. తండాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని గిరిజనులకు సూచించారు. ఏదైనా సమస్యను అధికారులు పరిష్కరించకపోతే కమిషన్‌ను ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌కుమార్ నాయక్, ఎంఈఓ మున్వర్‌బాషాతో పాటు పలువురు తండా వాసులు పాల్గొన్నారు.

# ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగుల సంబరాలు



గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

**అనంతపురం అగ్రికల్చర్:** జాతీయ బ్యాంకులతో సమానంగా పెన్షన్ పథకం అమలు చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంపై ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు హర్షాతిరేకం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో రీజినల్ రూరల్ బ్యాంకు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. న్యాయస్థానంలో పిటిషన్లు వేసి సంవత్సరాల పాటు పోరాటం సాగించిన రాజారెడ్డి, రవీంద్రనాథ్‌త్రిపాఠి, పిటిషనర్ల తరపున వాదించి కేసు గెలిపించిన సుప్రీంకోర్టు అడ్వకేటు షర్మిలా ఉపాధ్యాయ తదితరులను ఘనంగా సత్కరించారు. 1993 సెప్టెంబర్ 1 నుంచి పెన్షన్ పథకం అమలు చేసి న్యాయం చేయాలని తీర్పు ఇవ్వడం పట్ల విశ్రాంత ఉద్యోగులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలగనుందని నాయకులు తెలిపారు. విజయోత్సవ సమావేశానికి వేలాది మంది పెన్షనర్లు, కుటుంబ సభ్యులు హాజరై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు శివశంకరరెడ్డి, ప్రభాకరరెడ్డి, లక్ష్మినరసయ్య, రామచంద్ర, శ్రీరామరెడ్డి, రుపావతి,వీరారెడ్డి, సాంబశివారెడ్డి, నాగయ్య, ఎస్‌టి ప్రసాద్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సుధాకర్ తదితరులను కూడా సన్మానించారు.

# వ్యవసాయ కూలీల వలసబాట

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి



మాట్లాడుతున్న కేశవరెడ్డి

**అనంతపురం అర్బన్:** ''జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఉపాధి లేక వ్యవసాయ కూలీలు వలసబాట పట్టారు. రానున్న రోజుల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి'' అని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి రాకుండా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 24న గుంటూరులోని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా తలపెట్టామన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్లు, యంత్రాలతో పనులు చేయిస్తూ పేదల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. పథకం కింద 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. దినసరి వేతనం రూ.700 ఇవ్వాలన్నారు. కార్డులో పేరున్న ప్రతి వ్యక్తికి విడిగా జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు తక్షణం చెల్లించాలన్నారు. మెటీరియల్ కాంపోనెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. లేనిపక్షంలో ఉపాధి భృతిగా ఏడాదికి ప్రతి కూలీకీ రూ.12 వేలు ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఉపాధి పథకంలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెల శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు పెరుగు సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

### శేషవాహనంపై రంగనాథుడు



శేషవాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు

**గుత్తి రూరల్:** తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బొలికొండ రంగనాథుడు శేషవాహనోత్సవంపై విహరించాడు. శనివారం రాత్రి రంగనాథుడి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు ఇచ్చిన శేషవాహనంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా గ్రామ శివారులోని జమ్మి చెట్టు వరకూ ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమద్ వాహనోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

### 12న డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ

**రాప్తాడు:** నియోజకవర్గంలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని రైతులకు ఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం, ఉద్యాన శాఖ ద్వారా ఈ నెల 12 డ్రిప్, స్ప్రింకర్ల పంపిణీ చేస్తున్నట్లు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథ్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన రాప్తాడులో పర్యటి ఈ నెల 12న నిర్వహించే కార్యక్రమానికి నాలుగు రోడ్ల కూడలిలో స్థల పరిశీలన చేశారు.

**ల్యాబ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే**

ఏపీఐఐసీ పారిశ్రామిక పార్క్‌లో ఉద్యాన శాఖ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన ఎలైట్ బయోటెక్ ల్యాబ్ (అరటి పిలకలు తయారు చేసే పరిశ్రమ)ను ఎమ్మెల్యే పరిటాల సునీత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అరటి పిలకలు తయారీ గురించి పరిశ్రమ వ్యవస్థాపకుడు రాఘవేంద్ర ఎమ్మెల్యే సునీతకు వివరించారు.

### నేడు కోటంకలో అన్నదానం

**గార్లదిన్నె:** మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహోత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం భార్య వెంకట సుబ్బమ్మ, కుమారులు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.